క్లుప్తంగా

నేడు చెన్నకేశవస్వామి కల్యాణం



ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో నేడు (బుధవారం) కళ్యాణం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణానికి ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఆత్మకూరు : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని కాటమయ్య, ఎల్లమ్మ దేవతలకు మంగళవారం అయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కృషి చేస్తానని చెప్పారు.

నేడు గండ్ర దంపతుల రాక

శాయంపేట : మండలానికి నేడు (బుధవారం) భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి రానున్నట్టు ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు గండ్ర దంపతులు ప్రారంభోత్సవం చేస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై గండ్ర దంపతుల కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

ఆత్మకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర పండిత జేఏసీ ప్రతినిధి పూర్ణచందర్ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భాషా పండితులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. భాషా పండితుల డిమాండ్లను నెరవేర్చే వరకు సహాయ నిరాకరణ తప్పదని స్పష్టం చేశారు.

గీత కార్మికుడికి గాయాలు



ఐనవోలు : తాటి చెట్టుపై నుంచి కింద పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని వెంకటాపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన మడుగురి రాజు కులవృత్తిలో భాగంగా మంగళవారం సాయంత్రం తాటివనంలో కల్లు గీయడానికి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడి గాయాల పాలయ్యాడు. తోటి గీత కార్మికులు రాజును వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

మెపా జిల్లా ఉపాధ్యక్షుడిగా భిక్షపతి



భీమదేవరపల్లి : ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) జిల్లాఉపాధ్యక్షుడిగా మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన భూమ భిక్షపతిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో భిక్షపతి మాట్లాడారు. ముదిరాజ్ కులస్తుల అభివృద్ధి, రిజర్వేషన్, సంక్షేమం కోసం రాజకీయాలకు అతీతంగా పాటుపడతానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన నాయకులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సదరం క్యాంపు స్లాట్ బుక్ చేసుకోండి

శాయంపేట : ఈనెలలో నిర్వహించనున్న సదరం క్యాంప్‌కు దివ్యాంగులు మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఫిబ్రవరి 1 మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మీసేవ కేంద్రాల్లో ఆర్థోపెడిక్, అంధత్వ, మానసిక, వినికిడి లోపమున్న వ్యక్తులు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 8 నుంచి అన్ని కేటగిరీలకు సదరం క్యాంప్‌లు నిర్వహించనున్నట్టు ఎంజీఎం అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బోనాలతో వస్తున్న మహిళలు



ప్రారంభోత్సవాలకు వస్తున్న కేటీఆర్, ఇతరులు

కేటీఆర్ సందడి..

కమలాపూర్‌లో ఎంజేపీ గురుకుల పాఠశాల, ప్రభుత్వ, కేజీబీవీ జూనియర్ కళాశాలలను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, మంత్రులు గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డితో కలిసి రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ ప్రారంభించడానికి మంగళవారం రాగా ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు స్వాగతం పలికారు.

–కమలాపూర్



విద్యార్థినితో కరచాలనం చేస్తున్న మంత్రి కేటీఆర్



కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న జనం



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కౌశిక్‌రెడ్డి

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



భీమదేవరపల్లి : నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీఓ భాస్కర్



నడికూడ : నిర్మాణ పనులను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ వెంకనారాయణ

భీమదేవరపల్లి : 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ భాస్కర్ ఆదేశించారు. మండలంలోని వంగర లోని పాఠశాలలో కిచెన్ షెడ్ నిర్మాణ పనులకు మంగళవారం ఆయన భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేసి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం మురికి కాలువలు, షాపింగ్ కాంప్లెక్స్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సర్పంచ్ నల్లగాని రాజు, ఎంపీటీసీ నల్ల కౌసల్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కర్ర రాజమల్లారెడ్డి, ఎంపీఓ నాగరాజు, ఎంపీహెచ్ఈఓ కేఎల్ఎన్.స్వామి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ ఆఫీసర్ పరిశీలన

నడికూడ : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో చేపట్టిన ప్రహరీ, వంట గది, మరుగుదొడ్లు, తదితర పనులను స్పెషల్ ఆఫీసర్ వెంకటనారాయణ సందర్శించి పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊర రవీందర్, కార్యదర్శి సందీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను వినియోగించుకోవాలి



కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ

పరకాల : కంటివెలుగు కార్యక్రమాన్ని అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో కంటివెలుగు కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కంటివెలుగు ద్వారా ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు, అద్దాలు ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. అవసరమైన వారికి శస్త్రచికిత్స సైతం చేస్తారని వివరించారు. పేదలు కంటివెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకుని లబ్ధి పొందాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, కౌన్సిలర్ దామెర మొగిళి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నీరు నిలిచి ఇబ్బందులు



నీటిలో నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులు

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అవరణలో నీరు నిలువడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో 80 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గ్రామ సమీపంలోని చెరువులోకి కెనాల్ నీరు రావడంతో మత్తడి పడి నీరు పాఠశాల ఆవరణలోకి చేరి నిలిచింది. విద్యార్థులు నీటిలోంచే నడవాల్సిన దుస్థితి నెలకొందని హెచ్ఎం ప్రభాకర్, విద్యా కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్ వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో నిలిచిన నీటిని తొలగింపజేయాలని వారు కోరుతున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ర్యాలీ



ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

నడికూడ : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడంతోపాటు మండల కేంద్రంలో జంతు హింస నివారణ సంఘం ఆధ్వర్యంలో అడవులు, సరస్సులు, నదులను, వన్యప్రాణులతోసహా సహజ పర్యావరణాన్ని రక్షించాలని కోరుతూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. తొలుత వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కెవి.నారాయణ, సంచాలకులు శ్రీనివాస్, రవికుమార్, మండల పశు వైద్యాధికారులు బాలకృష్ణ, వినయ్, సర్పంచ్ ఊర రవీందర్‌రావు, ఎంపీటీసీ అప్పం చేరాలు, తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న వరి పంట



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

శాయంపేట : యాసంగిలో వేసిన వరి పంటలు నెలలో రోజులకే ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎందుకు పంట ఎండిపోతుందా తెలియక రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆరెకరాల పంట ఎండిపోవడంతో ఏఓ గంగా జమున సందర్శించి పంటను పరిశీలించి చౌడు నేల సమస్య వల్ల పంట ఎండిపోయిందని నిర్ధారించారు. మండలంలోని తహరాపూర్‌కు చెందిన అల్లం రాజకొమురయ్య, మొగిళి ఆరెకరాల్లో యాసంగి సీజన్‌లో అన్నం రకానికి వరి విత్తనం వేశారు. నెల ఐదురోజులకే పంట పూర్తిగా ఎండిపోయిందని, దీంతో తనకు రెండు లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు. ఈ విషయాన్ని విత్తన కంపెనీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వరి పంట ఎండిపోవడంతో వ్యవసాయాదికారులకు సమాచారం ఏఓ గంగాజమున, ఏఈఓ రాకేష్ మంగళవారం పంట క్షేత్రాన్ని సందర్శించి పరిశీలించారు. పంట సాగుకు ముందు వ్యవసాయ భూమిలో జిప్సం, జీలుగలు, పెంట వేసి కలియదున్నాలన్నారు. పంట తీసివేశాక మట్టి నమూనాల సేకరించి భూసార పరీక్ష చేయించాలని సూచించారు. ప్రస్తుతం చైలేటెడ్ జింక్ ఎకరాకు 200 గ్రాములు స్ప్రే చేయాలన్నారు. పురుగుల తెగులు నివారణకు ఎకరాకు శాఫ్ 200 గ్రాములు పిచికారి చేయాలని ఏఓ గంగా జమున బాధిత రైతులకు సూచించారు.

కేటీఆర్‌కు నిరసన సెగ



కమలాపూర్: రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్‌కు హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో నిరసన సెగ తగిలింది. కమలాపూర్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడానికి మంగళవారం కమలాపూర్ మండలంలోని గూడూరు శివారు నుంచి ఓపెన్ టాప్ వాహనం ద్వారా ర్యాలీగా వెళ్తుండగా స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సమీపంలో కేటీఆర్ గో బ్యాక్ అంటూ ఎన్ఎస్‌యూఐ నాయకులు నినాదాలు చేస్తూ నల్ల జెండాలతో నిరసన తెలుపుతూ ర్యాలీని అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో పోలీసులు ఎన్ఎస్‌యూఐ నాయకులను అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ నాయకులు ఎన్ఎస్‌యూఐ నాయకులపై దాడికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు ఎన్ఎస్‌యూఐ నాయకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కాగా విద్యార్థుల సమస్యలపై మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి యత్నించిన ఎన్ఎస్‌యూఐ నాయకులను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. కాగా కేటీఆర్ పర్యటనను అడ్డుకునేందుకు యత్నించిన హుజూరాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 13 మంది నిరసనకారులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సంజీవ్ తెలిపారు.

ప్రజాసంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

ధర్మసాగర్ : ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఉచిత సురేష్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల ఎల్ఓసీని అతడి కుటుంబీకులకు శ్రీహరి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడారు. సురేష్ పరిస్థితిని సర్పంచ్ ఎర్రబెల్లి శరత్ తన దృష్టికి తీసుకురాగా సీఎంఆర్ఎఫ్ నుంచి సాయం మంజూరు చేయించినట్టు తెలిపారు. ఆపదలో ఉన్న పేదలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా కలిగిస్తోందని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అన్నిన కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కొంతం సదానందం, వెంగళ నర్సయ్య, కడియం యువసేన నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ హఫీజ్, గుండె జగన్, చిలుక విన్నూ, చిలుక సుఖేందర్, బెల్లం ప్రేమ్‌కుమార్, ముజ్జు, అఖిల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి



పులిగిల్లలో ప్రజలతో మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం కృష్ణమూర్తి

నడికూడ : ఆర్టీసీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) కృష్ణమూర్తి కోరారు. మండలంలోని పులిగిల్ల గ్రామంలో 'ప్రజల వద్దకే ఆర్టీసీ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా డీఎం మాట్లాడారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని చెప్పారు. సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సంస్థ కసరత్తు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌చార్జ్ ఆర్.కృష్ణకుమారి, సర్పంచ్ పాలకుర్తి సదానందం, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ బ్యాట్లు అందజేస్తున్న సర్పంచ్

శాయంపేట : క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని మైలారం సర్పంచ్ అరికిల్ల ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఆ గ్రామానికి చెందిన క్రీడాకారులకు రూ.6 వేల విలువైన బ్యాట్లను మంగళవారం ఆయన అందించి మాట్లాడారు. క్రీడాకారులు బ్యాట్లను వినియోగించుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించి గ్రామ కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

బీసీ విద్యార్థుల ఉన్నతే సీఎం ధ్యేయం



మాట్లాడుతున్న గంగుల కమలాకర్



ఎంపీ, ఎమ్మెల్యే ఫొటోలు లేకుండా ఉన్న ఫ్లెక్సీ

● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల

కమలాపూర్ : వెనుకబడిన కులాల (బీసీ) విద్యార్థుల ఉన్నతే సీఎం కేసీఆర్ ధ్యేయమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. బీసీ సామాజికవర్గానికి చెందిన విద్యార్థులు ఉన్నత వర్గాలకు దీటుగా క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆయన ఆకాంక్షించారు. మండల కేంద్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే (ఎంజేపీ) గురుకుల పాఠశాల, ప్రభుత్వ, కేజీబీవీ జూనియర్ కళాశాలలను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రులు గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ మంగళవారం ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మంత్రి గంగుల మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 60 ఏళ్లు గడచినా పాలకులెవరూ వెనుకబడిన కులాల విద్యారంగ ఉన్నతికి చొరవ చూపలేదని చెప్పారు. స్వరాష్ట్ర సాధన తర్వాత బీసీల కోసం 310 గురుకులాలు ఏర్పాటు చేసి సుమారు 1.60 లక్షల మంది పేద విద్యార్థులకు అత్యుత్తమ విద్యాబోధన అందిస్తున్నారంటూ సీఎం కేసీఆర్‌ను కొనియాడారు. మంత్రి కేటీఆర్ వెనుకబడిన కులాలకు చెందిన అధునాతనమైన, అద్భుతమైన పాఠశాల భవనాన్ని ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ ఎంజేపీ గురుకులాల్లో ఇంటర్, డిగ్రీ విద్య ప్రారంభించి ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.1.25 లక్షలు ఖర్చు చేస్తుండడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల కోరిక మేరకు అన్ని ఎంజేపీ విద్యాలయాల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు, వాటర్ హీటర్లు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. అందరూ హ్యాపీయా అనగానే విద్యార్థులు కేరింతలు కొట్టారు.

స్వాగత ఫ్లెక్సీపై కనిపించని స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఫొటోలు

కమలాపూర్ : మండల కేంద్రంలో ఎంజేపీ గురుకుల పాఠశాలల భవనాలను ప్రారంభించడానికి రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ వచ్చిన సందర్భంగా ఎంజేపీ బాలికలు, బాలుర గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఫొటోలు లేవు. పాఠశాలల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ప్రజాప్రతినిధుల ఫొటోలు ముద్రించాల్సి ఉండగా స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఫొటోలు ముద్రించక పోవడంపై జనం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వేడుకగా హజ్రత్ సయ్యద్ మదార్ షావలీ ఉర్సు



విద్యుత్ దీపాల అలంకరణతో దర్గా



గంధం తీసుకొస్తున్న మత పెద్దలు

నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలోని మహమ్మద్ షా నల్లమాటు వాగు ఒడ్డున ఉన్న హజ్రత్ సయ్యద్ మదార్ షావలి దర్గా ఉర్సు ఉత్సవాలు సోమవారం రాత్రి పరకాల జామ మస్జిద్ నుంచి సందల్ దర్గాకు షాషాబ్‌ల విన్యాసాలతో ఊరేగింపుగా రావడంతో వేడుకగా ప్రారంభమయ్యాయి. కులమతాలకు అతీతంగా దర్గాను వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. దర్గా ముతవల్లి మహ్మద్ ఖాజీ ఖాద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేక కవ్వాలి కార్యక్రమాలతో ఉత్సవాలు జోరుగా సాగుతున్నాయి.

రాంబాబుకు ముఖ్యఅర్చకుడిగా పదోన్నతి



రాంబాబుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఈఓ కిషన్‌రావు, చైర్మన్ కుమారస్వామి

భీమదేవరపల్లి : మండలంలోని కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయంలో అర్చకుడిగా పని చేస్తున్న మొగిలిపాలెం రాంబాబుకు ముఖ్యఅర్చకుడిగా పదోన్నతిని కల్పిస్తూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈఓ కిషన్‌రావు తెలిపారు. సీనియర్ అర్చకుడిగా పని చేస్తున్న రాంబాబు ఆలయంలో దాతల సాకారంతో పలు అభివృద్ధి పనులతోపాటు జాతరలో భక్తులకు విశేష సేవలందించినందుకు గానూ ఆయనకు పదోన్నతి కల్పించారు. కాగా పదోన్నతి కల్పిస్తూ జారీ చేసిన పత్రాన్ని రాంబాబుకు ఆలయ ఈఓ కిషన్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి మంగళవారం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు కంచనపల్లి రాజన్న, వీరభద్రయ్య, సదానందం, శివకుమార్, శరత్‌చంద్ర, సందీప్, శ్రీధర్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



లేగదూడలకు టీకా వేస్తున్న వైద్యాధికారి సునీల్

శాయంపేట : పశువులకు టీకాలు వేయించి బ్రూసెల్లోసిస్ (ఈచుడు రోగం, అబార్షన్) నుంచి కాపాడుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ సునీల్ కోరారు. మండలంలోని తహరాపూర్ గ్రామంలో సిబ్బందితో కలిసి లేగదూడలకు మంగళవారం ఆయన వ్యాధి నివారణ టీకాలు వేసి మాట్లాడారు. పశు పోషకులు పశువులను రోగాల బారి నుంచి కాపాడుకునేలా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటికొండ మౌనిక, రవికిరణ్, వీఎల్ఓ రమేష్‌బాబు, జేవీఏ సారంగం, వీఏ సదానందం తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ధర్మసాగర్ : కడియం యువసేన ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి హనుమకొండలోని ఆయన నివాసంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కడియం యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల అందజేత

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలోని సంతాన లింగేశ్వర స్వామి ఆలయానికి శివ, పార్వతుల ఉత్సవ విగ్రహాలను హైదరాబాద్‌కు చెందిన గీతావాణి–చంద్రకుమార్ దంపతుల తరపున విగ్రహాలను ఆలయ మేనేజర్ ఎల్.రవికి జి.సునీల్ అందజేశారు.

ఏసీడీ వసూలు సరికాదు

కాశిబుగ్గ: రాష్ట్రంలో ఏసీడీ (అడ్వాన్స్‌డ్ కంజంప్షన్ డిపాజిట్) పేరిట వసూళ్లు చేస్తున్న అదనపు విద్యుత్ చార్జీలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా వరంగల్ జిల్లా నాయకుడు పసునూరు రాజు డిమాండ్ చేశాడు. ఈమేరకు శివనగర్ విద్యుత్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్ మండలికి రూ.33 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉందన్నారు. ఈక్రమంలో బకాయిలను ప్రభుత్వం నుంచి రాబట్టుకోవాల్సిన రాష్ట్ర విద్యుత్ మండలి అధికారులు.. ప్రజలపై డెవలప్‌మెంట్ పేరుతో అదనపు విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోందన్నారు. కార్యక్రమంలో నరసింహారావు, మోహన్, వెంకటస్వామి, చిన్నస్వామి, ఎల్లయ్య, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.